కథ

# మమ్మీ, ఆకలి!

> ''బాగుందిరా వరస. వీళ్ళమ్మకు ఎంతసేపూ ఆ లేడీస్ క్లబ్ గొడవ తప్ప వీడి గురించి పట్టించుకోదు. నువ్వేమో క్యాంప్‌లంటావు. వీడిని రేపాక మారు డాక్టర్‌కి చూపించి అన్ని టెస్టులూ చేయించు. నీకు తీరిక లేకుంటే చెప్ప నేనే వీడిని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్తాను.''

''మింటూ! నువ్వు ఈ రోజు స్కూలుకి రావా?'' అని అడిగాడు ప్రక్కింటి బాల్కనీలోంచి సుధీర్.

''వస్తున్నానే!''

''అయితే ఇంకా నైట్ డ్రెస్‌లోనే వున్నావేం? ఎప్పుడు రెడీ అవుతావు? బస్సు వచ్చేస్తుంది తెలుసా?'' అంటూ హెచ్చరించాడు. వాడు స్కూల్ డ్రెస్ వేసుకుని రెడీగా ఉన్నాడు.

మింటూ వెంటనే బాత్రూంలోకి పరిగెత్తాడు.

సుధీర్, మింటూ ఇద్దరూ ఒకే ఈడువారు. వయస్సు ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయి. రెండో తరగతి చదువుతున్నారు. ఇద్దరూ చురుకైన పిల్లలే.

బాత్రూంలోకి వెళ్లాక మింటూకి జ్ఞాపకం వచ్చింది తన బాత్రూంలో గీజర్ పని చేయడంలేదని. మమ్మీ బాత్రూంలో స్నానం చేద్దామనుకుంటే మమ్మీ ఇంకా లేవలేదు. తలుపు గడియ వేసుకుంది. డాడీ రూం లాక్ చేసుంది అనుకుని చల్లనీళ్ళే నాలుగు మగ్గులు ఒంటిమీద పోసుకుని స్కూల్ డ్రెస్ వేసుకున్నాడు.

''ఆయా ఈ రోజు కూడా రాలేదు. తను మిల్క్ త్రాగలేదు'' అనుకుని ఫ్రిజ్‌లోవున్న బ్రెడ్‌లోంచి మూడు స్లైసెస్ తీసుకుని వాటిని జామ్ రాసుకుని తిన్నాడు. మిగిలిన మూడు స్లైసెస్ మీదా జామ్ రాసుకుని టిఫెన్ బాక్స్‌లో పెట్టుకుని దానిని స్కూల్ బేగ్‌లో సర్దుకుని వాటర్ బాటిల్, స్కూల్ బాగ్ తీసుకుని బయటకు వచ్చాడు. గార్డెన్‌లో మొక్కలకు నీళ్ళు పెడుతున్న సాంబయ్యతో చెప్పి గేటు బయటకు వచ్చేసరికి స్కూలు బస్సు రావడంతో అందులో ఎక్కి కూర్చున్నాడు.

గోపీ వల్లభరావు, అమరేశ్వరిల ఏకైక సంతానం మింటూ. గోపీ వల్లభరావు గొప్ప వ్యాపారవేత్త. ఎప్పుడూ బిజినెస్ టూర్‌లో వుంటాడు.

అమరేశ్వరి లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్. తనో గొప్ప అందగత్తెననే గర్వం. ఆమె క్లబ్ ప్రెసిడెంట్ అయిన తరువాత క్లబ్‌ను ఎంతో డెవలప్ చేసింది. వూర్లో లేడీస్ క్లబ్‌కి మంచి పేరు వచ్చేలా చేసింది. క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు విరివిగా విరాళాలు సేకరిస్తోంది.

అమరేశ్వరికి ఇంట్లో పూచీలేదు. ఇంటి పని చేయడానికి సాంబయ్య ఉన్నాడు. అతను ఎంతో నమ్మకస్తుడు. మింటూ అవసరాలు చూసి సంరక్షణ చేయడానికి వంట పనికి ఆయాగా హనుమంతమ్మను ఏర్పాటుచేసింది. ఆయా ప్రతి దినం ఉదయం ఆరుగంటలకు వచ్చి మింటూని నిద్రలేపి వాడి అవసరాలన్నీ చూసి స్కూల్‌కి పంపిస్తుంది. మధ్యాహ్నం లంచ్ స్కూల్‌కి తీసుకువెళ్తుంది. ఈవినింగ్ వాడు స్కూల్ నుంచి వచ్చేక వాడికి టిఫిన్ పెట్టి వాడి చేత హోంవర్క్ చేయించి చదివిస్తుంది. రాత్రి 8 గంటలకు భోజనం పెట్టి వాడు తిన్నాక తను కూడా తిని వాడి తల్లిదండ్రులకు డిన్నర్ డైనింగ్ టేబుల్‌పై వుంచి ఇంటికి వెళ్తుంది.

భర్త ఊర్లో వుంటే రాత్రి డిన్నరు ఇంటివద్ద చేస్తుంది అమరేశ్వరి. లేకుంటే కాఫీ, టిఫిన్, లంచ్, డిన్నర్ అన్నీ బయటే. అమరేశ్వరికి పేకాట పిచ్చి జాస్తీ. టైం లెక్క చేయదు. అవతలవాళ్ళ పర్స్ ఖాళీ చేయందే విడువదు. ప్రతి ఏటా క్లబ్ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిపిస్తున్నారు. ముఖ్య అతిధిగా మంత్రిగారిని పిలవడం రివాజు. అందువల్ల ఏర్పాట్లన్నీ దగ్గరుండి స్వయంగా పర్యవేక్షిస్తోంది అమరేశ్వరి.

గోపీవల్లభరావుకి ఆరో ప్రాణం మింటూ. ఇంటివద్దనున్న సమయంలో ఎక్కువ భాగం కొడుకుతోనే గడుపుతాడు. వాడిని ఎన్నో విధాల ఎంటర్‌టైన్ చేస్తూ వాడి ముద్దు ముచ్చటలు, ఆటపాటలు చూసి సంతోషిస్తాడు.

ఆ రోజు గోపీవల్లభరావు క్యాంప్ నుండి వచ్చి కొడుకు కోసం కొని తెచ్చిన రకరకాల గిఫ్టులు తీసుకుని వాడి గదిలో అడుగుపెట్టాడు. మింటూ కుర్చీలో దిగులుగా కూర్చున్నాడు. వాడి ముఖంలో ఎంతో నీరసం కనిపిస్తోంది. మనిషి తోటకూర కాడలా వాడిపోయాడు. తండ్రి పలకరింపుతో వాడు తండ్రి ముఖంలోకి చూసి పేలవంగా నవ్వాడు.

తను కనిపించగానే సంతోషంతో చెంత చేరే కొడుకు ఇలా డల్‌గా వుండడం ఎప్పుడూ చూడలేదు గోపీ వల్లభరావు.

''ఏం బాబూ! అలా వున్నావు? ఒంట్లో బాగులేదా? ఫీవర్ వచ్చిందా? డాక్టర్ని పిలవనా?'' అంటూ ఒక్క అంగలో కొడుకువద్దకు వెళ్ళి వాడి నుదుటిమీద చేయివేసి చూసి వొళ్ళు వెచ్చగా లేనందుకు సంతోషించాడు.

''కాసేపు కారులో అలా బయట తిరిగొద్దామా?'' అన్నాడు. ఇంట్లో వాడు ఒంటరితనం ఫీలవుతున్నాడేమో వాడ్ని అలా కాస్సేపు బయట త్రిప్పి తీసుకొద్దామనుకుని.

వాడు సరేననడంతో కొడుకుని కార్లో తీసుకుని బయల్దేరాడు. కొంతదూరం వెళ్లిన తరువాత ''ఎటువెళ్దాం? బీచ్‌కా?'' అన్నాడు. మింటూ తల అడ్డంగా తిప్పాడు. ఎగ్జిబిషన్‌కి వాడొద్దన్నాడు.

''మరి'' కొడుకు ముఖంలోకి చూసాడు.

తండ్రితో బయటకు వచ్చినప్పుడల్లా ఏదో హోటల్‌కి వెళ్ళి టిఫెన్ తిని ఊరంతా తిరిగి రావడం మింటూకి అలవాటు. ఈ రోజు అందుకు వ్యతిరేకంగా వుండడంతో ఎంతో నిరాశ చెందాడు. మింటూ అందరు పిల్లల్లా 'నాకు ఇది కావాలి, అది కావాలి' అని పేచీ పెట్టడు. వాడి తత్వం వేరు. ఎంతో హుందాగా ప్రవర్తిస్తాడు.

''పోనీ అత్తయ్య వాళ్లింటికి వెళ్దామా?'' అన్నాడు.

మింటూ అంగీకరించడంతో కారు అటు ప్రక్క పోనిచ్చాడు.

''డాడీ! అలగా జనం అంటే?'' అన్నాడు మింటూ.

కొడుకు ప్రశ్నకు కాస్త తృళ్లిపడి ''ఏం? ఎందుకు?''

''మరి...'' అంటూ ఏమో చెప్పబోయాడు. అయితే ఆవరకే కారు వాళ్ళ అత్తయ్య ఇంటి పోర్టికోలో ఆగడంతో తలుపు తెరిచి క్రిందకు దిగాడు.

''రా గోపీ చాలా రోజులకు. ఏమిటీ మధ్య అస్సలు కనిపించడంలేదు!'' అని తమ్ముడిని పలకరించి ''ఓహో! మింటూ కూడా వచ్చాడా?'' అంటూ విరూపాక్షమ్మ మేనల్లుడి వీపుమీద చేయి వేసింది.

ఆవిడ చేయి వీపుమీద పడగానే మింటూ విలవిలలాడి కాస్త ప్రక్కకు తప్పుకున్నాడు. అయితే ఆవిడ ఆ విషయం గమనించలేదు.

''బావగారేరి అక్కా?'' అన్నాడు గోపీ వల్లభరావు. సాధారణంగా విరూపాక్షమ్మ భర్త పుండరీకాక్షయ్యగారు ఆ సమయంలో లాన్‌లో పచార్లు చేస్తుంటారు. ఆయన ప్రొఫెసర్. వారికి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు రమేష్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండోవాడు సురేష్ ఇంటర్ చదువుతున్నాడు. మూడోవాడు నందగోపాల్ సిక్స్త్ క్లాస్.

''మీ బావగారు ఏదో పనుందని హైదరాబాద్ వెళ్లారు. అవునూ మింటూ ఏమిట్రా ఇంత నీరసంగా, డల్‌గా కనిపిస్తున్నాడు?'' అని మేనల్లుడిని ఒళ్లో కూర్చోబెట్టుకుని ముద్దులాడింది.

''ఏమో నాకు తెలియదు అక్కయ్యా! నేను ఇప్పుడే కేంపునుండి వచ్చాను. వీడిలా డల్‌గా రూమ్‌లో కూర్చున్నాడు. పోనీ అలా బయట తిప్పి తీసుకొద్దామని...''

''బాగుందిరా వరస. వీళ్ళమ్మకు ఎంతసేపూ ఆ లేడీస్ క్లబ్ గొడవ తప్ప వీడి గురించి పట్టించుకోదు. నువ్వేమో క్యాంప్ లంటావు. వీడిని రేపొక మారు డాక్టర్‌కి చూపించి అన్ని టెస్టులూ చేయించు. నీకు తీరిక లేకుంటే చెప్పు నేనే వీడిని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్తాను.''

''డాక్టర్ దగ్గరకు వద్దు అత్తయ్యా. నేను బాగానే వున్నాను' అన్నాడు మింటూ.

''హాయ్ మామయ్యా! హాయ్ మింటూ... మమ్మీ ఆకలి. నాకు ఆకలి దంచేస్తోంది'' అన్నాడు నందూ క్రికెట్ బ్యాట్ గదలా భుజంమీద పెట్టుకుని సుడిగాలిలా డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తూ.




''అబ్బాయిగారు అక్కడ అలా నిలబడే ఓ చేత్తో బ్యాట్ పట్టుకుని మరో చేత్తో తింటారా?'' అంది విరూపాక్షమ్మ నవ్వుతూ.

''సారీ...లేదు మమ్మీ ఇదిగో వన్ మినిట్లో స్నానం చేసి వచ్చేస్తాను. మింటూ నా కొత్త బాట్ చూసావా?'' అంటూ చేతిలోని బ్యాట్ మింటూకిచ్చి బాత్రూమ్‌వేపు పరుగెత్తాడు నందగోపాల్.

మింటూ బ్యాట్ అందుకుని దాని వేపొకమారు చూసి క్రింద పెట్టేయడం చూసి గోపీవల్లభరావు, విరూపాక్షమ్మ ఆశ్చర్యపోయారు.

నందూ కనిపిస్తే చాలు వాడితో అరగంటసేపైనా క్రికెట్ ఆడందే వూరుకోడు మింటూ. అటువంటిది వాడికీరోజు ఆటమీద ఇంట్రెస్టులేదు. 'నిజంగానే వాడికేదో అయింది' అనుకున్నాడు.

''నందూ ఆకలికి అర నిముషమైనా తాళలేడు. వాడు స్నానం చేసి వచ్చేసరికి అన్నం పెట్టాలి. మింటూ నువ్వు కూడా బువ్వ తింటావా?''

మింటూ కళ్ళు మెరిసాయి. ''తింటాను'' అని తల ఊపాడు.

''నువ్వు రారా గోపీ. ఈరోజు అందరం కలసి సరదాగా భోజనం చేద్దాం'' అంటూ డైనింగ్ హాల్లోకి నడిచింది మింటూ చేయి పట్టుకుని. మేడమీద చదువుకుంటున్న ఇద్దరు కొడుకులనూ పిల్చింది.

మింటూ ప్లేట్లో పెట్టిన అన్నం సరిగా కలుపుకోకుండానే రెండు ముద్దలు గబగబా నోట్లో పెట్టుకుంటే గొంతుకి అడ్డం పడి ఉక్కిరిబిక్కిరయ్యాడు.

రావి-ఎస్-అవధాని

''ఏమిటి బాబూ! ఆ తినడం? అన్నం మెత్తగా కలుపుకుని నెమ్మదిగా తినాలి. ఉండు నేను కలిపి తినిపిస్తాను'' అని వాడికి అన్నం మెత్తగా కలిపి చిన్నముద్దలు చేసి నోటికందించింది.

మేనత్త అభిమానానికి వాడెంతో ఆనందించాడు.

''మమ్మీ నాకెప్పుడూ ఇలా గోరుముద్దలు తినిపించలేదు'' అనుకున్నాడు. వాడి మనసులో ఆ భావన రావడంతో అప్రయత్నంగా వాడి కళ్ళవెంట నీళ్ళు కారాయి.

మింటూ కళ్ళ వెంట నీళ్ళు రావడం చూసి వాడి మేనత్త చలించిపోయింది.

''ఏం బాబూ! కూరలో కారం ఎక్కువైందా? ఇంద ఈ స్వీట్ తిను'' అని జిలేబీ వాడి నోటికి అందివ్వబోయింది.

వాడు జిలేబీని చప్పున చేతితో అందుకుని-

''లేదు అత్తయ్యా! కూరలో కారం ఎక్కువగా లేదు. చాలా బాగుంది'' అని ''అత్తయ్యా! మరి ఇప్పుడు నువ్వు నందూ బావని కొట్టలేదేం?'' అని అడిగాడు.

''ఏం వాడినెందుకూ కొట్టడం?'' అని ఆశ్చర్యపడి ''ఆ...అవును కదూ. వాడు ఈరోజు నిన్ను క్రికెట్ ఆడిపించలేదు కదూ?'' అంది నవ్వుతూ.

''ఆ..అందుక్కాదు అత్తయ్యా...మరి...మరి'' అంటూ చెప్పడానికి సందేహించాడు.

''భయంలేదు చెప్పుబాబూ. నందూ ఏం తప్పు చేశాడు?''

''నేనేం తప్పుపని చేయలేదమ్మా?'' అన్నాడు నందు ఉక్రోషంగా.

''ఉండరా వాడిని చెప్పనీ. నందూ ఏం తప్పు పని చేసాడు?''

''వాడు ఇందాక 'మమ్మీ ఆకలి, మమ్మీ నాకు ఆకలి వేస్తోంది' అన్నాడు కదా. మరి అందుకు!'' అన్నాడు మింటూ.

మేనల్లుడి మాటలకు తొలుత ఆశ్చర్యపడి తరువాత పక్కున నవ్వేందావిడ.

''అదేమిటి బాబూ! మమ్మీ ఆకలి అంటే అన్నం పెట్టాలి లేదా తినడానికి టిఫిన్ ఏదైనా ఇవ్వాలి కాని ఎవరైన కొడతారా?'' అంది.

''మరి నిన్న నేను మమ్మీ ఆకలేస్తోంది అంటే మమ్మీ నన్ను ఎందుకు కొట్టింది?'' అన్నాడు మింటూ.

''ఏమిటీ ఆకలేస్తోందంటే మీ మమ్మీ నిన్ను కొట్టిందా?'' అన్నారు అక్కా తమ్ముడు ఒకేమారు ఆశ్చర్యంతో.

''ఛా! మీ మమ్మీ అందుకు కొట్టదు'' అంది.

''నిజం! గాడ్ ప్రామిస్. అలగా జనంలా ఆకలేస్తోందంటావా? అని కొట్టింది. చూడు వీపుమీద ఇంకా మండుతోంది'' అన్నాడు బొంగురుపోయిన గొంతుతో.

విరూపాక్షమ్మ మేనల్లుడి చొక్కా పైకెత్తి చూసింది. మింటూ వీపుమీద రెండు అంగుళాల మేర చీరుకుపోయి వుంది. నందూ అన్నం ప్లేటు ముందు నుంచి లేచి వెళ్లి బేండెయిడ్ ప్లాస్టరు బాక్స్ తెచ్చి తల్లికిచ్చాడు. ఆవిడ వెంటనే చేయి కడుక్కుని వచ్చి ప్లాస్టర్ వేసింది.

''ఇంక తగ్గిపోతుందిలే. ప్లాస్టరు వేశానుకదా'' అని వాడికి పెరుగు అన్నం తినిపించి వాడి మూతి, చేయి కడిగింది.

తరువాత వాడిని లాలిస్తూ అడిగింది ''ఏం జరిగింది?'' అని.

మింటూ తండ్రివేపు ఓమారు చూసి జరిగింది చెప్పాడు.

ప్రతి దినం ఉదయాన్నే రావాల్సిన ఆయా హనుమమ్మ గత దినం రాలేదు. మింటూ నిద్రలేచి బ్రష్ చేసుకోగానే గ్లాసుడు వేడిపాలు త్రాగడం అలవాటు. మరి ఆయా రాకపోవడంతో వాడికి ఉదయం పాలులేవు. టిఫిన్ లేదు. వాడు ఫ్రిజ్‌లోంచి బ్రెడ్ జామ్ తీసుకుని తిని తయారై స్కూలుకి వెళ్లాడు. వాడికి లంచ్ ఎవరూ తీసుకుని వెళ్లలేదు. లంచ్ టైంలో వాడు పాకెట్ మనీతో ఐస్‌క్రీం కొనుక్కుని తిన్నాడు. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన తరువాత వాడికి టిఫిన్, పాలులేవు. ఆయా లోగడ ఎప్పుడూ ఇలా నాగా పెట్టలేదు. వాడికి ఎంతో ఆకలిగా ఉంది.

అమరేశ్వరి నలుగురు ఇంపార్టెంట్ వ్యక్తులతో వచ్చి డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని సీరియస్‌గా డిస్కస్ చేస్తోంది.

మింటూ విసురుగా తల్లిపద్దకు వెళ్లాడు.

''మమ్మీ ఆకలి! మమ్మీ నాకు ఆకలిగా వుంది'' అన్నాడు.

''మింటూ! డోన్ట్ డిస్టర్బ్. గో...'' అంది అమరేశ్వరి సౌమ్యంగా.

''మమ్మీ నాకు చాలా ఆకలి వేస్తోంది. మరేమో ఆయా...'' అంటూ ఏమో చెప్పబోయాడు.

అసలే ఎంతో టెన్షన్‌తోవున్న అమరేశ్వరి కొడుకు మొండితనం, మాట వినకపోవడం సహించలేకపోయింది. నలుగురిలో తన పరువు తీసాడని కోపం వచ్చింది. వాడి రెక్క పుచ్చుకుని మేడమీద వాడి గదిలోకి తీసుకుని వెళ్లింది.

''మేనర్స్ లేకుండా అలగా జనంలా 'మమ్మీ ఆకలి, మమ్మీ ఆకలి' అని నలుగురిలో నా పరువు తీస్తావా?'' అంటూ వాడిని కొట్టింది. అలా కొట్టడంలో ఆమె చేతి గాజు వాడి వీపుకి తగిలి చీరుకుపోయింది.

ఆవిడ మూడ్ పాడైందని వెంటనే వచ్చిన వారిని తీసుకుని కార్లో తిరిగి క్లబ్‌కి వెళ్లిపోయింది.

మింటూ తన రూంలో కూర్చుని చాలాసేపు ఏడ్చాడు. ఏం చేయాలో తెలియలేదు. నాలుగు బ్రెడ్ పీసెస్ తిని మంచినీళ్లు త్రాగి పడుకున్నాడు.

ఈరోజు ఉదయం కూడా ఆయా రాలేదు. అందువల్ల వాడికి పాలు, టిఫిన్, లంచ్‌లేదు. బ్రెడ్ పీసెస్ తిని మంచి నీళ్లు త్రాగడంతో వాడు చాలా నీరసించిపోయాడు.

వాడు ఈ సంగతంతా ఆవిడకు చెప్పి-

''అత్తయ్యా! నేను నీ దగ్గరే వుంటాను. నన్ను వుండనియ్యవా?'' అన్న మేనల్లుడి మాటలకు ఆమె హృదయం ద్రవించి వాడిని గుండెలకు హత్తుకుంది విరూపాక్షమ్మ.

★

## వయస్సుతో నిమిత్తంలేదు

మన దేశంలో చాలావరకు వయస్సు మీరిన వారు ఏదైనా కొత్త పని చేయడానికి లేక అధ్యయనం చేయడానికి వెనుకంజ వేయడం పరిపాటి. ఇందుకు వారు చెప్పే కారణం 'వయసు అయిపోయింది, ఇప్పుడేదయినా నేర్చుకునే వయస్సా?' అని ఎదురు ప్రశ్న వేస్తారు. జీవితంలో గుర్తింపు రావాలంటే జీవితాంతం నిరవధిక ప్రాతిపదికపై కృషి సల్పుతూనే ఉండాలి. దేనికీ వయస్సుతో సంబంధంలేదు అని తెలుస్తోంది.

అమెరికన్ రాజకీయవేత్త బెంజమన్ ఫ్రాంక్లిన్ తన 50వ ఏట సైన్సు, వేదాంతం అధ్యయనం చేయడం ప్రారంభించి ఎన్నో ప్రయోగాలు గావించి లైటెనింగ్ కండక్టర్‌తో పాటు ఎన్నో పరికరాలను కనుక్కోవడమే కాదు, అమెరికన్ రాజ్యాంగం రూపొందించడంలో కూడా ఎనలేని సేవలందించి ఈనాటికీ చిరస్మరణీయుడు అయ్యాడు.

రవీంద్రనాథ్ ఠాగోర్ విశ్వకవి మాత్రమేకాదు, గొప్ప చిత్రకారుడు కూడా. ఇంతకీ ఈయన చిత్రలేఖనం నేర్చుకున్నది తన అరవై ఏడవ ఏట.

అమెరికాలో కాలిఫోర్నియా దగ్గరున్న ఇన్‌గ్లేవుడ్‌కి చెందిన మహిళ శ్రీమతి మావుడేటుల్ మోటారు వాహనాలను నడపడం నేర్చుకున్నది పండు ముదుసలి వయస్సుయిన 92వ ఏట అంటే ఇంకా ఆశ్చర్యంగా వుంటుంది.

విలియం ఎవర్ట్ గ్లాడ్ స్టోన్ (1809-1898) రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి ప్రధాన మంత్రి అయింది ఆయన 80వ ఏట. ఇంత వయసులో కూడా ఆయన నిరంతర కృషితో రెండు సార్లు బ్రిటన్ ప్రధానమంత్రి అయ్యారు.

జోసఫ్ కాన్‌రాడ్ (1857-1924) పోలండ్‌లో జన్మించి ఇంగ్లాండ్‌కి వలస వచ్చి స్థిరపడ్డ రచయిత. ఈయనకు 25 ఏళ్లు వయస్సు వచ్చిందాకా ఆంగ్ల భాషలో ఓనమాలు తెలియవు. అయినా కూడా ఆంగ్ల భాషను అభ్యసించి, సముద్ర యానం జరిపి సాగరాలను ఇతివృత్తాలుగా ఉంచి కథలను వ్రాసి సుప్రసిద్ధ రచయిత అయ్యారు. ఈయన వ్రాసిన 'అల్మాయర్స్ ఫాలీ' అన్న నవల ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా చదువుతున్నారు. కృషిలో జోసఫ్ కానరాడ్‌ని మించిన రచయిత్రిగా అలయిన్ పొల్లాక్‌ని మనం వర్ణించవచ్చు. ఈవిడ వ్రాసిన తొలి నవల అయిన 'పోర్ట్ రైట్ ఆఫ్ మై విక్టోరియన్ యూత్' ఈవిడకు సరిగ్గా నూట రెండేళ్ళ ఎనిమిది నెలల ప్రాయంలో ప్రచురితమైంది.

వీళ్లలా ఎందరెందరో వయస్సుతో నిమిత్తం లేకుండా జీవితంలో నిర్మాణాత్మకమయిన పనులు చేయడానికి కృషి చేసిన, చేస్తున్న వాళ్ళున్నారు. కనుక వీళ్ళను, వీళ్ళ కృషి గురించి తెలుసుకుంటే చాలు అది మనకి ఉత్సాహాన్ని కలిగించి మనల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసి ముందుకు నడిపిస్తాయి.

-భూక్యా గోపీనాయక్